# ఫలితము ఏమిటి!!!

శ్రీ వఝ శ్రీకృష్ణమూర్తి.

నాకు మంచిమంచి పుస్తకాలు చదవదమన్నా, బొమ్మలు పోగుచేయడమన్నా వుండే సరదా మీరు, నాకు మరి దేనియందు వున్నట్లూ కనిపెట్టలేరు. కారణం నాకు ఈ రెండూ అంటే చిన్నప్పటినుంచి అదో వెర్రి. ముస్సోలినీ జీవిత చరిత్ర అంతా తెలుసుకుందామనే కుతూహలం నన్ను అనేక లైబ్రరీలను, ముస్సోలినీ జీవిత చరిత్రం కోసం తిరగవేసేటట్లు చేసింది. నాఅదృష్టం కొద్దీ ఓనాడు "మాడరన్ రివ్యూ"చూడ్డం తటస్థించింది. అందులో ఒక ప్రకటన చూచాను. అందులో ఈ క్రింది విధంగా వుంది.

……Mussolini and many speeches by him By P. N. Roy M. A. Price Rs. 3-8-0

కాని ఖరీదు 3_8_0 వుంది. ఇటువంటి పరిస్తితుల్లో [అదిగాక అది చాలా పెద్దపుస్తకమాయెను] ఈ పుస్తకాన్ని పోస్టుద్వారా తెప్పిస్తే చార్జీలు యెక్కువ అవుతయి. అంచేత 'ఏదన్నా లైబ్రరీలో ఈ గ్రంధం దొరక్క పోతుందా' అనుకున్నాను. ఆలోచించి చూడగా మా యూనివర్సిటీ లైబ్రరీలో తప్పకుండ ఈ గ్రంధం వుండి తీరుతుంది. అని తట్టింది. "ఓసారి దాన్ని కళ్లారచూచి విషయం తెలుసుకువద్దాము; ఎంత అదృష్టవంతుణ్ణి!!" అనుకుంటూ గాల్లో మేడలు కట్టుకుంటూ లైబ్రరీకి బయలుదేరాను. నిజంగా పరిసీలిస్తే యూనివర్సిటీ లైబ్రరీలో షుమారు 70వేల గ్రంధాలు అమిత ఖరీదుగల ప్రతులు వున్నయ్యి. నా దురద్రుష్టాన్ని నిందించటం ఎందుకు? నా అదృష్టంవుంటే ఈ గ్రంధం అందులో వుండకూడదూ! అనుకుంటూ బయలుదేరాను.

లైబ్రరీకి వెళ్ళాను. "క్లార్క్" దగ్గరకు వెళ్లి "అయ్యా ఈ పుస్తకం మీ దగ్గర వుందా?" అని పుస్తకం పేరుచెప్పి ప్రశ్నించేను. కాని ఆయన ఛాదస్తమేమో పేరు చెప్పినా నన్ను చంపుకొని తిన్నాడు. నామీద ఓ ప్రశ్నల వర్షాన్ని కురిపించేడు. ఇక యిలా కాదురా నాయనా అనుకుని ఈ క్రింది విధంగావ్రాసి అక్కడ పెట్టాను.

"I require the book mussolini and his speeches by Mr. P. N. Ror. M. A."

సరే క్లార్కు ఆ కాగితాన్ని ఒకసారి, నా ముఖాన్ని ఒకసారి, చూచి, ఒకసారి తలగోక్కుని ఒక్క నిట్టూర్పు విడిచి పూరుకున్నాడు. ఇదేమిట్రా యిలా వున్నాడు! శరీరంలో అస్వస్థత ఏం కలుగలేదు కదా నా ఉత్తరం చూచేటప్పటికి!!! అని అనుకున్నాను.

—అంటే నా దస్తూరి చాలా అందంగా వుంటుంది లెండి! నేను వ్రాసిన (అక్షరము)—ఒక్కటి కనుక్కునేటప్పటికి షుమారు పది తలనొప్పి మందు సీసాలయినా ఆఖరు చేయవలసి వుంటుంది.

చివరికి ధైర్యంచేసి యిలా ప్రశ్నించాను.

"ఏమండీ! ఈ పుస్తకం మీ లైబ్రరీలో లేదూ?"

నా యీ పొలికేకకు గాఢ నిద్రనుండి ఒక్కసారి అదిరిపడి లేచి మళ్లా నన్ను నఖశిఖ పర్యంతము వీక్షించి తల వూపి "సీరియస్"గా "నేనెప్పుడు ఈ పుస్తకం పేరు వినలేదే" అన్నాడు.

'హరీ పీడి తప్పాదియ్యా! ఇంత సేపు ఏడిపించాడు.' అనుకుని... పైకి.

"అది గాదండి! అది యీ మధ్య నే పబ్లిష్ అయిన బుక్కు అవటంవల్ల మీరు ఆ పుస్తకం పేరు వినివుండక పోవచ్చును. అయినా మీరు వోమారు క్రొత్త పుస్తకాల లిస్టులు చూడండి" అన్నాను.

ఎట్లాగో ఓపిక చేసుకుని ఆ లిస్టు చూచాడు. కాని పెదవి విరిచి, "ఇందులో గూడా లేదే ఆ పుస్తకం పేరు! మీరు బహుశః పొరపాటు పడి వుంటారు. మీకు మారుపేరు చెప్పి వుండాలి." అన్నాడు

ఇంక నేనేం మాట్లాడుతాను! పోనీ "కాదయ్యా దేముడా! అది నేను కళ్లార చూచాను" అంటే నమ్ముతాడా అంటే "నీకు బహుశః షార్టు సైట్ వచ్చిందేమో. అయినా ఈ కాలం పిల్లలకుకూడా తర్వగా షార్ట్సైట్ వచ్చేస్తుందండి" అనే బాపతులో వున్నాడా పెద్ధమనిషి.

అయినాపోనీ "అయ్యా పంతులు గారూ! మీరు నాకోసం ఓసారి మళ్ళా ఆ లిస్టు నిదానించి చూడండి" అని అందామా అనుకుంటే "ఏమోయ్! నాకు ఏదన్నా చత్వారం వచ్చిందంటావా ఏమిటి! లేకపోతే చూచిందే మళ్లా చూడ్డం ఎందుకు?" అని మీదబడేట్టున్నాడు.

చిట్టచివరకి తెగించి ఓసారి యిలా అన్నాను.

"అయ్యా, ఆ లిస్టు యిలా అన్నాయియ్యండి. నేను చూచుకుంటాను" అన్నా.

"ఏమిటయ్యా యిదేనా పెద్దమనిషి తరహా, లైబ్రరీలో చాలా స్ట్రిక్టురూల్సు అని తెలీదూ? ఇమాత్రం జ్ఞానం వుండక్కరలేదూ? వెధవ పుస్తకం కోసం వచ్చావు! ఇటువంటి వెధవ పుస్తకాలను

ఈ లైబ్రరీలో వుంచరని తెలీదూ? వెధవ పుస్తకాల్తో మా గ్రంథాలయాన్ని నింపటానికి మాకు యిష్టంలేదు.'' అని కసురుకుని మళ్లా కొంచెం తమాయించుకుని "అయినా ఒకసారి మళ్లీ రండి. ఈలోగా ఆ పుస్తకం గురించి యెవరన్నా బాగా వుందని చెపితే మేము దాన్ని కొని వుంచుతాం'' అన్నాడు తాపీగా.

కొన్నాళ్ళకు అంటే ఒక నెలరోజులకు మళ్లా ఆ లైబ్రరీకి వెళ్లాను. నన్ను చూసీ చూట్టంతోటే ఆ క్లర్కు ఏమను కున్నాడో ఏమిటో మరి, దగ్గరున్న కుర్చీలాగి అందులో కూర్చోపెట్టాడు.

అప్పుడు మెల్లగా "ఆ పుస్తకం కొన్నారండి'' అని ప్రశ్నించాను.

ఆహా! ఆలాగా!! ఆ పుస్తకమా! ఏ పుస్తకమూ!! ముస్సోలినీ!!! అని అర్థంలేని మాటలతో కాసేపు కాలం గడిపి లేచి చివరకు యిలాగా అన్నాడు

"మీరడిగిన పుస్తకం వచ్చింది, కాని సార్. మీరు దురదృష్టవంతులు సార్, చాలా ఆలస్యం చేసేరు. బుక్కు కోసం అప్పుడే 10మంది రిజిష్టర్ చేయించుకున్నారు పేర్లని. ఇప్పుడు మీకు యివ్వలేనందుకు చాలా విచారిస్తున్నాను-అని తన విచారాన్ని ముఖంలో చూపెట్టాడు.

"హరి కాలాంతకుడా!" అనుకుని మనస్సులో, పైకి ఏదో అంటానికి నోరు తెరుస్తూంటే "సార్, మీరు మీపేరును రిజిస్టర్ చేయించుకోండి, పుస్తకం ఖాళీగా వున్నప్పుడు మీకో ఉత్తరం వ్రాస్తాను" అని అన్నాడు. సరేనని నాపేరు పుస్తకంలో వ్రాశాను.


మళ్ళా నెలకు నాకు జాబు వచ్చింది. ఇంత త్వరలో నాకు ఛాన్సు వచ్చినందుకు సంతోషిస్తూ, నా అదృష్టాన్ని పొగుడు కుంటూ లైబ్రరీకి వెళ్ళాను. "ఏమిటండీ సార్ యింత త్వరలో నాకు "ఛాన్సు వచ్చిందే" అన్నాను.

"ఏమోనండీ ఒక్కరూ తీసుకున్న వాళ్లల్లో చదివిన పాపాన్ని పోలేదనుకుంటాను. ఎవ్వరూ రెండురోజులు కంటె యెక్కువకాలం వుంచుకోలేదు" అన్నాడు క్లర్కు. నే నాశ్చర్యపడ్డా. "అయిన వెధవలకి యింత మంచి పుస్తకంలో చదివేది దొరకలేదేమో'' అని అనుకుంటూ నా అదృష్టానికి నేను సంతోషిస్తూ "అయితే ఆ పుస్తకం యిలా యివ్వండి" అని అడిగాను.

ఆపాట ఆక్లర్కు లేచి ఒక పుస్తకం తెచ్చి యిచ్చాడు. ఆనందాగ్నిలో కాలిపోతూవున్న నానోటినుండి ఆశ్చర్యమయిన కేకవొకటి వెలువడింది.

ఇదేనా Mussolini and his speeches అనే 1250 పేజీలుగల గ్రంథం!-అట్టలు లేవు సరేగదా మొదలూ లేదు చివర లేదు!! ఆశ్చర్యపోయాను. మొదటిపేజి 50 అని అంకెవుంది చివరపేజి 110అని అంకెవుంది. నాలో నేనువిచారించి దాన్ని పట్టుకుని ఇంటికి వెళ్లిపోయాను. మిగత పనులన్నిటిని పూర్తిచేసుకుని తీరిగ్గా, అన్నంతిన్న తర్వాత వరండాలో చల్లగాలికి ఓ కుర్చీవేసుకుని సిగరెట్టు కాలుస్తూ అవున్న పేజీలనయినా గ్రహించి ముసోలినీ అంతవాణ్ణి అవుదాం అనుకుంటూ, కొన్ని పేరాలు చదివాను. నాలో హుషారంతా ఒక్కసారి చచ్చిపోయింది. తెల్లమొగమేశాను. ఇంతాచూస్తే అది నే పిప్పుఘారములో చదివున "Baffoon Balaram!"

నాకు ఆశ్చర్యమూ కోపమూ ఒక్కసారి వచ్చినయ్యి "హరి దీని తస్సాగొయ్య! చివరకు foolనయిపోయానే" అనుకుంటూ ఆలోచనా సముద్రంలో పడ్డాను. ఒక్కసారి చెయ్యి వేలుచురుక్కు మనేటప్పటికి ఆలోచనా సముద్రంనుంచి ఒక్క దూకుతో అసలు ప్రపంచానికివచ్చి పడ్డాను. సిగరెట్టు అంతా కాలిపోయి చివరకు వేలుకూడా కాల్చేసింది! ఇంత సంతోషపడి చదవ మొదలు పెట్టినందుకు "ఫలితం ఏమిటి!!!"


మా సతీసుతలకు
సహాయ హస్తము
ఋతుసంబంధమైన దోషములను
పారద్రోలి ఆరోగ్య జీవనమును
ప్రసాదింపగల ఔషధరాజము
లోధ్ర


గర్భాశయ రోగములను నిర్మూలన మొనరించి సత్సంతానమునకు మార్గము చూపునది
కేసరికుటీరం
మద్రాసు
లోధ్ర